తీరానికి పర్యాటక శోభ



సిద్ధమవుతున్న అడ్వెంచర్ పార్కు

- పెదగనగళ్లవానిపేట బీచ్‌లో అభివృద్ధి పనులు
- ఏటా పెరుగుతున్న సందర్శకులు

శ్రీకాకుళం రూరల్:

తీర ప్రాంత పర్యాటకం, బీచ్‌ల అభివృద్ధిపై పర్యాటకశాఖ దృష్టి సారించింది. దీనిలో భాగంగా ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు సమాయత్తమైంది. అందులో భాగంగా శ్రీకాకుళం రూరల్ మండలం పెదగనగళ్లవానిపేట బీచ్‌ను సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతోంది. శ్రీకాకుళం నగరానికి 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదగనగళ్లవానిపేట, కుందువానిపేట బీచ్‌లకు పిక్నిక్‌ల సమయంలో సందర్శకులు పోటెత్తుతుంటారు. మిగిలిన సమయంలో వారాంతపు రోజుల్లో బీచ్‌లు పర్యాటకులతో కిటకిటలాడుతుంటాయి. దీనిలో భాగంగా పర్యాటక శాఖ పదేళ్ల లీజుతో ప్రైవేట్‌పరంగా అభివృద్ధి చేసేందుక సన్నద్ధమైంది. ప్రధానంగా అడ్వంచర్ పార్కు, బోటింగ్, రెస్టారెంట్ వంటి సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురానుంది.

రూ.కోటిన్నరతో సీసీ రోడ్డు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో ప్రస్తుత కూటమి సర్కా రు రూ.కోటీ రూ.50లక్షలతో సీసీరోడ్డు పనులు చేపడుతున్నాయి. తీరం వెంబడి విద్యుత్‌లైట్లు ఏర్పాటు చేయనున్నారు.



తీరం వెంబడి వేస్తున్న రోడ్డు

డిసెంబర్‌లో ప్రారంభం

డిసెంబర్‌లో అడ్వెంచర్ పార్క్, బోట్ షికారు ను ప్రారంభించనున్నాం. ఇప్పటికే తీరం అభివృద్ధికి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాం. ప్రస్తుతం పనులన్నీ శరవేగంగా జరుగుతున్నాయి.

– నారాయణరావు, జిల్లా పర్యాటకశాఖాధికారి

సందర్శకుల తాకిడి..

పర్యాటకులను ఆకట్టుకునేలా బీచ్‌ను అభివృద్ధి చేస్తే సందర్శకులు మరింత ఎక్కువగా వస్తుంటారు. ఇప్పటికే పిక్నిక్ సమయంతో పాటు వీకెండ్స్‌లో బీచ్‌లు కిటకిటలాడుతున్నాయి. బోటింగ్, రెస్టారెంట్ వంటివి ఏర్పాటు చేస్తే మరింత బాగుంటుంది.

– పి.చైతన్య, శ్రీకాకుళం



సిద్ధమవుతున్న ప్రత్యేక ఆకర్షణలు



బోట్‌షికారు చేసే ప్రాంతం ఇదీ



ఫొటోషూట్‌లు చేసుకునేందుకు అనువుగా..

క్లుప్తంగా

11న భగవద్గీత పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని డీసీసీబీ కాలనీలో భూసమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో డిసెంబరు 11న భగవద్గీత పోటీలు జరుగుతాయని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. గీతా జయంతిని పురస్కరించుకొని భగవద్గీతలోని 12, 15 అధ్యాయాలపై జరిగే పోటీలకు 10 నుంచి 14 ఏళ్ల లోపు బాలబాలికలు అర్హులని పేర్కొన్నారు. ఉదయం 10గంటల నుంచి సాముహిక గీతా పారాయణలు జరుగుతాయని తెలిపారు. సంప్రదాయ దుస్తులలో హాజరుకావాలని కోరారు. ఆసక్తి గల చిన్నారులు 9441072762 నంబరుకు ఫోన్ చేసి డిసెంబరు 8లోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

నేడు పింఛన్ల పంపిణీ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో శనివారం సామాజిక పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంపీడీవో సీపాన హరిహరరావు తెలిపారు. 12512 మంది పింఛనుదారులకు రూ.5.11 కోట్లు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. 28 గ్రామ సచివాలయాల పరిధిలో 222 మంది ఉద్యోగులను 499 క్లస్టర్లుగా విభజించి పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

వేటకు దూరంగా మత్స్యకారులు



బడివానిపేట తీరానికే పరిమితమైన బోట్లు

ఎచ్చెర్ల క్యాంపస్: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు శుక్రవారం సముద్రంలో చేపల వేటకు దూరంగా ఉన్నారు. ఒడ్డునే వలలు, బోట్లను సురక్షితంగా భద్రపర్చారు. డి.మత్స్యలేశం, బడివానిపేట, బుడగుట్లపాలెం మత్స్యకారులు వేటకు వెళ్లలేదు. ఎచ్చెర్ల మండలంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి తేలిక పాటివర్షాలు కురుస్తున్నాయి.

తుఫాన్‌పై అప్రమత్తం



మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీకాంత్

జి.సిగడాం: ఫెంగల్ తుఫాన్ నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఎం.శ్రీకాంత్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరికోతలు పూర్తయితే వెంటనే కుప్పలుగా పెట్టుకోవాలన్నారు. ధాన్యం బస్తాలను రోడ్డుపైనే వదిలేయకుండా షెల్టర్‌లో భద్రపరుచుకోవాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ ఎస్.నిర్మల, రీసర్వే డీటీ గాయిత్రి, ఆర్‌ఐ రాధ, వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నీలమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పెద్దబరాటం వీధిలో ఉన్న నీలమ్మతల్లి దేవాలయం వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ బరాటం సాయిరాజ్, అర్చకులు కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో భక్తులు పాల్గొని అమ్మవారికి ముర్రాట్లు సమర్పించారు. అమ్మవారికి అభిషేకాలు, అలంకరణ చేశారు.

వైభవంగా కుంభాభిషేక మహోత్సవం



శిఖర కలశానికి అభిషేకం చేస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బోడెమ్మకోవెలలో ఉన్న జీవేశ్వరాలయంలో శివపంచాయతన సహిత రుద్రయాగ పూర్వక మహా కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా శుక్రవారం మాసశివరాత్రి పురస్కరించుకొని మహా కుంభాభిషేకం ఘనంగా జరిగింది. అర్చకులు వెంకటేశ్వరరావు, శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో వేదపండితులు రంగాభట్ల శ్రీను, అనిల్‌శర్మ, కె.శ్రీను పర్యవేక్షణలో ఆలయ శిఖరానికి 1100 కలశాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లిమర్లకు చెందిన సమతానంద దుర్గా మహా పీఠం, శ్రవణ చైతన్యానంద చిన్న స్వామీజి, కాలభైరవపీఠం నిర్వాహకులు గణేష్ గురూజీలు మాట్లాడుతూ మంచి కార్యక్రమంతో శాంతి సౌభాగ్యాలు కలుగుతాయన్నారు. ముందుగా సహస్ర లింగార్చనలు, ఆవరణార్చన, బిళ్వార్చన, సూర్యనమస్కారాలు, సాయంత్రం లక్ష్మీగణపతి, రుద్ర హోమాలు, సర్వతో భద్రమండల మూలమంత్ర హవనం, మండప పూజలు, శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, కమిటీ సభ్యులు బుర్రా వెంకటరావు, తాళాడ రవీంద్ర, బస్వా రవి, యాగాటి ప్రసాద్, చిత్రడ గాంధీ, బబ్బాది లక్ష్మణరావు, రాయితి చంద్రశేఖర్, గణగళ్ల కొర్లయ్య, శిల్లా శ్రీరామముర్తి, తంగుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అనురాగ నిలయానికి వితరణ



చక్రాల కుర్చీలను అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఆర్ అండ్ బీ కార్యాలయం ఎదురుగా ఉన్న శాంతాకల్యాణ్ అనురాగ నిలయంలో వృద్ధులు, చిన్నారుల కోసం మూడు చక్రాల కుర్చీలను దాతలు శుక్రవారం బహూకరించారు. విశాఖకు చెందిన రాబిన్‌హుడ్ ఆర్మీ సంస్థ అధ్యక్షురాలు మాడుగుల రేణుక, హరికృష్ణ సహకారంతో శ్రీకాకుళం రాబిన్‌హుడ్ ఆర్మీ సంస్థ ప్రతినిధి నంది ఉమాశంకర్ వీటిని అందజేశారు. సంస్థ అధ్యక్షురాలు మాగుడుల రేణుక మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన ఐబీఎం అండ్ గూడెర సంస్థలు ఈ చక్రాల కుర్చీలను సమకూర్చాయని చెప్పారు. కార్యక్రమంలో అనురాగ నిలయం వార్డెన్ పి.లలిత, జి.ఆశ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో సంతోషిమాత యాగ మహోత్సవాలు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అర్చకులు, ఈవో

శ్రీకాకుళం కల్చరల్ : పాత శ్రీకాకుళంలోని సంతోషి మాత ఆలయంలో పంచాయతన సహిత యాగ మహోత్సవాలు ఫిబ్రవరి 7 నుంచి 9 వరకు జరుగుతాయని ఈఓ సర్వేశ్వరరావు, అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ తెలిపారు. ఈ మేరకు ఆలయం వద్ద శుక్రవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. భక్తులంతా పాల్గొనాలని కోరారు. అనంతరం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

పారిశ్రామిక విజ్ఞాన యాత్ర



పారిశ్రామిక సందర్శనలో వెంకటాపురం విద్యార్థులు

ఎచ్చెర్ల: లావేరు మండలం వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9, 10వ తరగతుల విద్యార్థులు శుక్రవారం పారిశ్రామిక సందర్శన విజ్ఞాన యాత్ర నిర్వహించారు. పత్తికాయవలస ప్రాంతంలోని పోడరన్ ఫుడ్స్ ప్రైవేట్ లియిటెడ్ పరిశ్రమను సందర్శించారు. ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్‌ను కంపెనీ ప్రతినిధులు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అరుణకుమారి పాల్గొన్నారు.

సమగ్ర ప్రగతి పత్రాల అందజేత



హెచ్‌ఎంకు ప్రగతి పత్రాలు అందజేస్తున్న ఎంఈఓ పున్నయ్య

ఎచ్చెర్ల క్యాంపస్: అన్ని పాఠశాలలకు సమగ్ర ప్రగతి పత్రాలు అందజేస్తున్నట్లు ఎచ్చెర్ల ఎంఈఓ కారుపున్నయ్య తెలిపారు. శుక్రవారం పాఠశాలల హెచ్‌ఎంలకు సమగ్ర ప్రగతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 106 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి విద్యార్థులు పరీక్షల మార్కులను పత్రాల్లో నమోదు చేసి విద్యార్థుల ప్రతిభను అంచనా వేయనున్నట్లు చెప్పారు. ప్రోగ్రస్ కార్డుల స్థానంలో నూతనంగా ఈ కార్డులు అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు పాల్గొన్నారు.

కాకినాడ సమగ్ర శిక్ష ఏపీసీగా వేణుగోపాల్

శ్రీకాకుళం పాతబస్టాండ్:

జిల్లాకు చెందిన తహశీల్దార్ పప్పల వేణుగోపాల్‌కు ఇటీవల డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఆయన ప్రస్తుతం కొవ్వాడ అణు విద్యుత్ ప్రాజెక్టు భూసేకరణ విభాగంలో తహశీల్దార్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు మొదటి పోస్టింగ్ డిప్యూటీ కలెక్టర్ హోదాలో కాకినాడ జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన నియామకం పట్ల జిల్లాలో రెవెన్యూ అసోసియేషన్, రెవెన్యూ ఉద్యోగులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



వాండ్రంగిలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న పీడీ సుధాకర్

జి.సిగడాం: ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనుల నిర్వహణలో జి.సిగడాం జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచేలా సిబ్బంది కృషి చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుధాకార్ అన్నారు. శుక్రవారం వాండ్రంగి, ఆనందపురం, సంతవురిటి గ్రామాల్లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెటీరియల్ కాంపొనెంట్ పనులను వేగవంతం చేయాలన్నారు. పనుల్లో నాణ్యత తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బూరాడ వెంకటరమణ, ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు, పంచాయతీరాజ్ ఏఈఈ సత్యనారాయణ, టీఏ లక్ష్మణరావు, కార్యదర్శి వడగా గౌరీశంకరావు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న సుగుణాకర్‌రావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని విశాఖపట్నం నగర పాలక సంస్థ కార్యనిర్వాహక ఇంజినీర్ డాక్టర్ పాగిరి సుగుణాకర్‌రావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిశ్రమలు అవసరాలు, సాంకేతిక అంశాలపై విద్యార్థులు దృష్టిపెట్టాలన్నారు. కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్ వంటి అంశాలపై పట్టు సాధించాలన్నారు. ఉన్నత స్థాయి వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీసీ రజిని, రెక్టార్ అడ్డయ్య, ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ సమస్యల పరిష్కారానికి కృషి

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాల, ఆస్పత్రి సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. శుక్రవారం రిమ్స్ ఆస్పత్రిలోని సూపరింటెండెంట్ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. అధ్యాపకులు, వైద్యులు, సిబ్బంది కొరత, ఇతర సమస్యలను మంత్రి అచ్చెన్నాయుడు ద్వారా సీఎం దృష్టికి తీసుకుని వెళతానని చెప్పారు. సీటీ, ఎమ్మారై స్కాన్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. విద్యార్థులకు కళాశాల వసతి గృహాల్లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటాచలం, సూపరింటెండెంట్ డాక్టర్ షకీల, ఆర్‌ఎంఓ డాక్టర్ సుభాషిణి, అసిస్టెంట్ ఆర్‌ఎంఓ డాక్టర్ సీపీ శ్రీదేవి, డాక్టర్ ప్రసన్న కుమార్, డాక్టర్ సనపల నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎన్‌ఎంఎంఎస్ మోడల్ పరీక్ష

శ్రీకాకుళం న్యూకాలనీ: పీఆర్‌టీయూ శ్రీకాకుళం రూరల్ శాఖ తరపున అరసవల్లి రోడ్‌లో ఉన్న సంఘ కార్యాలయంలో ఎన్‌ఎంఎంఎస్ మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు మండలశాఖ అధ్యక్షుడు కుంచాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి వసంత రాజారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అరసవల్లి మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం నియోజకవర్గ స్థాయిలో ఉదయం 9.30 గంటలకు జరిగే ఈ పరీక్షకు శ్రీకాకుళం, గార మండలాల పరిధిలోని ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులంతా హాజరుకావచ్చని పేర్కొన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచే విద్యార్థులకు రూ.3వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

లే అవుట్ల పరిశీలన



జి.సిగడాం: మండలం పరిధిలో జగనన్న లే అవుట్లను శుక్రవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సీహెచ్ శేషగిరిరావు పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో మండలంలో 26 లే అవుట్లు వేయగా కొన్నిచోట్ల అవకతవకలు జరిగాయని ఫిర్యాదులు రావడంతో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని చెప్పారు. ఈయనతోపాటు ఏఈఈ గొల్లంగి యువరాజ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ



ఘన జీవామృతంతో కార్యకర్తలు

ఎచ్చెర్ల క్యాంపస్ : ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు నాలుగో రోజు శుక్రవారం జరజాంలో క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఏడాది పొడవునా ఆదాయాన్ని ఇచ్చే పంటల సాగుపై అవగాహన కల్పించారు. రసాయన, పురుగుల మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ సాగుపై దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు అసిస్టెంట్ మేనేజర్ ధనుంజయరావు రైతులకు సూచించారు. కషాయాలు, విత్తన గుళికలతో మెరుగైన ఫలితాలు వస్తాయని, భూసారం పెరుగుతుందని చెప్పారు.



భక్తిశ్రద్ధలతో మహాసంప్రోక్షణ

నగరంలోని తుమ్మావీధిలో లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శుక్రవారం మహాసంప్రోక్షణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈఓ మాధవి, అర్చకులు తిరుమల చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో విశ్వక్సేన పూజ, మండపారాధన, అగ్నిప్రతిష్ట, లక్ష్మీనరసింహ హోమం, పూర్ణాహుతి, తీర్థగోష్టి పూజా కార్యక్రమాల్లో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్



ఘనంగా తిరువీధి ఉత్సవం

ఎచ్చెర్లలోని గిరిజా ముక్కంటీశ్వర ఆలయ సేవా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కార్తీక మాస శివరాత్రి సందర్భంగా తిరువీధి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అఖండ హారతితో స్వామిని భక్తులు ఊరేగించారు. సాయంత్రం జలాధివాసం నిర్వహించారు. అర్చకులు పెంటా సంతోష్‌కుమార్‌శర్మ పర్యవేక్షించారు.

– ఎచ్చెర్ల క్యాంపస్



తుప్పలు తొలగించేదెన్నడో?

కింతలిమిల్లు నుంచి ఎచ్చెర్ల వరకు ఉన్న పాత జాతీయ రహదారి డివైడర్ల మధ్యలో పిచ్చిమొక్కలు పేరుకుపోయాయి. తుప్పలతో నిండిపోయాయి. ఇందులో నుంచి రాత్రివేళల్లో కుక్కలు ఒక్కసారిగా బయటకు వస్తుండటంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తుప్పల తొలగింపునకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్